మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జిగా చెట్లపల్లి యాదగిరి మాదిగ

**శివ్వంపేట, నవంబర్ 1 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఇంచార్జిగా శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన చెట్లపల్లి యాదగిరి మాదిగ నియామకమయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నియామక ప్రకటనను మంగళవారం అందజేశారు. చాలా సంవత్సరాలుగా జిల్లాలో చెట్లపల్లి యాదగిరి మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గ్రామ స్థాయి నుండి జాతీయ ఉపాధ్యక్షులు మాసాయిపేట యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో చెట్లపల్లి యాదగిరి మాదిగ మరింత బలోపేతం చేసేందుకు లక్ష్య సాధన కోసం శ్రమించారని ఎమ్మార్పీఎస్ గుర్తించింది. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగే పోరాటంలో మాదిగలతోపాటు ఉపకులాలను కూడగట్టి ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి చెట్లపల్లి యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆయనను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరిమాదిగ, రాష్ట్ర నాయకులు ఒన్నక్క మురళి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

-అపరిశుభ్రతపై ఆగ్రహం

**సంగారెడ్డి టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాల ఆవరణలోని ఎస్‌సి వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్ శశిధర్‌రెడ్డి సూచనలతో వసతి గృహాన్ని తనిఖీ చేసినట్లు హనుమంతరావు పేర్కొన్నారు. వసతి గృహ పరిసరాలను పరిశీలించిన న్యాయమూర్తి వసతి గృహ బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటగది, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పొంది ఉండాలని పేర్కొన్నారు.

# నేటి నుంచి సంగారెడ్డి జిల్లాలో భారత్ జోడోయాత్ర

**సంగారెడ్డి బ్యూరో నవంబరు 1, ప్రభాతవార్త:** నేటి నుంచి సంగారెడ్డి జిల్లాలో భారత్ జోడో యాత్ర ప్రారంభంకానుంది. జోడోయాత్రను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి ఏర్పాట్లలో నిమగ్నమైంది. నియోజకవర్గాల వారీగా అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. ఈనెల 2న భారత్‌జోడో యాత్ర సంగారెడ్డి జిల్లాలోకి చేరుకోనుంది. ఈనెల 7 వరకు ఉమ్మడి జిల్లాలో పూర్తికానుంది. సంగారెడ్డి జిల్లాలో ఈనెల 5వరకు సాగనుంది. కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌వరకు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ జిల్లాల లో పూర్తిచేసుకుని, జిల్లాలోకి ప్రవేశించనుంది. పాద యాత్రను విజయవంతం చేయడానికి ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు జనసమీకరణ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పాదయాత్ర సాగే ప్రధాన రహదారికి ఇరువైపుల కటౌట్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజు లింగంపల్లి నుండి ప్రారంభమై నారాయణఖేడ్ నియోజకవర్గంలోని గ్రామాల మీదుగా సాగనుంది. సంగారెడ్డిలో పాదయాత్ర విజయవంతా నికి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పాదయాత్ర ఉదయం ఆరు గంటలకే ప్రారంభం కానుండటంతో జనసమీకరణ కు ముమ్మర ఏర్పాట్లు చేయాల్సి వస్తోందని నాయ కులు తెలిపారు. రాహుల్‌గాంధీ షెడ్యూల్ ప్రకారం సాగనుంది. జనాలు ఎక్కువ ఉన్నా, తక్కువ ఉన్నా పాద యాత్ర యధావిధిగా సాగనుంది. 3న సంగారెడ్డి నియోజకవర్గం నుండి ప్రారంభమయ్యే యాత్ర గణేష్‌గడ్డ, చెర్యాల్, కంది, చౌరస్తా, చర్చి, ఐబి, కొత్తబస్టాండ్, రైతు బజార్, పాతబస్టాండ్ నుండి శిల్పారామం వరకు సాగుతుంది. అక్కడ సాయం త్రం నాలుగు గంటల వరకు విరామం అనంతరం యాత్ర ప్రారంభమై ఆదేరోజు సాయంత్రం జెఎన్ టియు సుల్తాన్‌పూర్ వరకు సాగి, రాత్రి అక్కడి విడిది ఉంటుంది. 4న యాత్రకు విరామం ఇచ్చి, 5న భారత్‌జోడో యాత్ర అందోల్ నియోజక వర్గం లోకి ప్రవేశిస్తుంది. దారిపొడవునా రాహుల్‌గాంధీకి స్వాగతం పలికేందుకు కాంగ్రెస్‌పార్టీ కార్యాకర్తలు ప్రణాళికలతో సిద్ధమవుతున్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రవేశించే పాదయాత్రకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పన్నెండుచోట్ల స్వాగత ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో స్వాగతం ఏర్పాట్ల వద్ద ఒక్కో విధంగా ఉండేలా చూస్తున్నారు.







రాహుల్ గాంధీకి స్వాగత బ్యానర్లను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులు

గణేష్‌గడ్డ వద్ద గిరిజన మహిళలతో సాంప్రదాయ నృత్యాలతో స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. చెర్యాలవద్ద యాదవసంఘం, సిఎస్ఐ చర్చివద్ద పాస్టర్లు ఐబివద్ద యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, రైతుబజార్ వద్ద దివ్యాంగులు, పోలీస్‌స్టేషన్ వద్ద బుడగజంగాలు, రామమందిర్ వద్ద మహిళలు స్వాగతం పలకనున్నారు. ఉదయం పదన్నర నుంచి పదకొండు గంటల మధ్య పాదయాత్ర శిల్పారామం చేరుకోనుంది. జహిరాబాద్ నియోజకవర్గం నుంచి వచ్చే కాంగ్రెస్ నాయకులు, కార్యాకర్తలు ఫసల్ వాది చౌరస్తావద్ద పాదయాత్రకు స్వాగతం పలుకను న్నారు. యాత్ర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా, పోలీసు యాంత్రంగం పటిష్టమైన ఏర్పాటు చేస్తోంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్ల లో పోలీసు అధికారులు నిమగ్నమయ్యారు. ఇందుకు సంబంధిత పోలీసు అధికారులు మంగళవారం సమీక్ష సమావేశాలు నిర్వహించారు.

**నేడు పటాన్‌చెరులో...**

**పటాన్‌చెరు/రామచంద్రాపురం, నవంబర్ 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గానికి ప్రవేశించనున్నది. హైదరా బాద్ నుండి జోడో యాత్ర జిల్లాలోకి సాయంత్రం నాలుగు గంటలకు చేరుకోనున్నది.

అక్కడి నుండి ప్రారంభమై పటాన్‌చెరు నియోజకవర్గం బీహెచ్ఈ ఎల్, బీరంగూడ కమాన్, రాచంద్రాపురం రైల్వే ట్రాక్, పటాన్‌చెరు మీదుగా ముత్తంగి, ఇస్నాపూర్, రుద్రారం గణేష్‌గడ్డవరకు కొనసాగుననది. అక్కడి నుండి రాహుల్ జోడో యాత్ర సంగారెడ్డి నియోజక వర్గంలోకి ప్రవేశిస్తుంది.

**భారత్ జోడో యాత్రకు భారీగా ఏర్పాట్లు...**

భారత్ జోడో యాత్ర సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఏర్పాట్లను చేశారు. బీహెచ్‌ఈఎల్ నుండి మొదలుకొని రుద్రారం, గణేష్‌గడ్డ వరకు పెద్ద ఎత్తున నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కటౌట్లు, స్వాగత బ్యానర్లను ఏర్పాటుచేశారు. రాహుల్ జోడో యాత్ర సాయంత్రం 4 గంటలకు బీహెచ్‌ఈఎల్ నుండి రుద్రారం వరకు సాయంత్రం ఏడు గంటలకు గణేష్‌గడ్డ రవకు కొనసాగనున్నది. రాత్రికి గణేష్‌గడ్డ ప్రాంతంలోనే బస చేయనున్నారు.

అయితే బీహెచ్ ఈఎల్ నుంచి జోడోయాత్ర మొదలుకాగానే ఆయా చౌరస్తాలలో రాహుల్ గాంధీ ప్రజలతో ముచ్చటించ నున్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ గాలి అనిల్‌కుమార్, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్‌లు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రను విజయవంతం చేసే విధంగా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**భారత్ జోడో యాత్ర జోష్...**

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున రాహుల్ గాంధీకి స్వాగతం పలుకుతూ కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేయడం చూస్తూ వారిలో జోష్ పెరిగినట్టుగా కనిపిస్తోంది.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ షెట్కార్

## జోడో యాత్రను విజయవంతం చేయాలి

**టిపిసిసి ఉపాధ్యక్షుడు సురేష్ షెట్కార్**

**పెద్దశంకరంపేట, నవంబర్ 1 ప్రభాతవార్త:** ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు యువకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేష్ షెట్కార్ అన్నారు. మంగళవారం కొత్తపేట, శివ్వాయపల్లి, వీరోజిపల్లి, జుక్కల్, రామోజిపల్లి, చీలపల్లి, ఆరెపల్లి తదితర గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తూ పాదయాత్రపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కార్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పెద్దశంకరంపేట మండల పరిధిలోని కోలపల్లి వద్ద ఈ పాదయాత్ర ప్రవేశిస్తుందన్నారు. నియోజవర్గంలోని ప్రతి గ్రామం నుండి యువత, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాయిని మధుసూదన్, జనార్ధన్, జైహిందర్‌రెడ్డి, గంగారెడ్డి, జైపాల్‌గౌడ్, మహిపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సాధించిన తంప్లూర్ విద్యార్థి

**టేక్మాల్, నవంబరు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తంప్లూర్ గ్రామానికి చెందిన భవానిప్రసాద్, వరలక్ష్మి దంపతుల తనయుడు భువనచంద్ర అలిండియా కెఈఈ ఎంట్రెన్స్‌లో ప్రతిభ కనబర్చి ఇండియాలోనే మొదటి ప్రతిష్టాత్మకమైన కళాశాల ఐఐటీ ఖరగపూర్ బిటేక్ విభాగంలో సీటు దక్కించుకున్నాడు. స్కూల్ లెవల్‌లో జాతీయ స్థాయిలో జరిగిన మాథ్స్ ఓలంయాడ్‌లో నిర్వహించిన పరీక్షల్లోన ఉత్తమ ప్రతిభ కనభర్చిగోల్ట్‌మేడల్ సాధించాడు. మండల జడ్పీటీసీ సభ్యులు సర్వోని సరోజమ మల్లేశం, గ్రామ సర్పంచ్ సంగయ్య, ఎంపిటీలు అబినంధించారు. మరిన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి అటు తల్లిదండ్రులకు ఇటు గ్రామనికి మంచి పేరును తీసుకురావాలన్నారు.

## కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జనార్ధన్

**పెద్దశంకరంపేట, నవంబర్ 1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన గుల్గరి జనార్ధన్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయిలో పదవి ఇచ్చినందుకు పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సురేష్ షెట్కార్, మెదక్ ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటామని, ఓబీసీలకు, ఇతరులకు రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ సేవలందిస్తానన్నారు.

## దత్తగిరి ఆశ్రమాన్ని దర్శించుకున్న అదనపు కలెక్టర్

**-ఆశ్రమ పీఠాధిపతులతో కలిసి ప్రత్యేక పూజలు**



శనీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**ఝరాసంగం, నవంబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని బర్దీపూర్ గ్రామంలో ఆద్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న దత్తగిరి ఆశ్రమాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి దర్శించుకున్నారు. ఆశ్రమానికి చేరుకున్న ఆదనపు కలెక్టర్‌కు ఆశ్రమ అర్చకులు రాజగోపురం వద్ద పూర్ణకుంబంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమ ఆవరణలోని శనిశ్వరుడికి, జ్యోతిర్లింగాలను, పంచ వృక్షాలను దర్శించుకుని మహా రుద్రాభిషేకం, మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డికి అప్పగారు ఆశీర్వచనాలు అందచేసి తీర్ధ ప్రసాదాలను వితరణ చేశారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి శ్రీశ్రీశ్రీ 108 అవదూతగిరి మహారాజ్, మాతృశ్రీ అనసూయమాతాజీ, భావి పీఠాధితపి డాక్టర్ సిద్దేశ్వరస్వామి, ఆధ్యాత్మిక వేత్త కొలన్ భద్రారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

**వార్తకు స్పందన**

## ఎన్‌వోసిలేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

**మున్సిపల్ కమిషనర్‌కు ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు**

జోగిపేట, నవంబర్ 01,ప్రభాతవార్త: అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో అందోలు చెరువు ఆయకట్టు కింద డిస్ట్రిబ్యూషన్ ఛానళ్లు మూసేస్తూ ఏర్పాటు చేస్తున్న పలు వెంచర్లపై చర్యలు తీసుకోవాలంటూ అందోలు ఇరిగేషన్ అధికారులు జోగిపేట మున్సిపల్ కమీషనర్‌కు లిఖితపూర్యకంగా ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడు వెంచర్లకు సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ చేసినప్పటికీ వారినుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ఈ వెంచర్లకు తమ ఇరిగేషన్ శాఖ నుంచి ఎలాంటి నోఆబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వలేదని వారు తెలిపారు. అయినప్పటికీ జోగిపేట హౌసింగ్‌బోర్డుకు ఎదురుగా ఉన్న ఓ వెంచర్ యజమానులు మాత్రం తమ ఇరిగేషన్ శాఖ అనుమతి లేకుండానే లే అవుట్ అప్రూవల్ తెచ్చుకున్నామని చెబుతున్నారని, అలాగే ఆ వెంచర్‌లో ఇప్పటికే పలు రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయని తెలిపారు. ఈ వెంచర్‌కు ఆనుకుని మూడు మీటర్ల వెడల్పులో అందోలు చెరువు కుడికాలువ డిస్ట్రిబ్యూషన్ ఛానల్ ఉందని, దానిని తీస్తే వెంచర్‌లోకి వెళ్లడానికి దారి ఉండదని, ఇవన్ని పరిగణలోనికి తీసుకుని తమ శాఖ ఎన్‌వోసి లేకుండా ఏర్పాటు చేస్తున్న వెంచర్లపై చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్‌కు తాము వెంచర్‌లకు అందచేసిన నోటీసులతో సహా అన్నివివరాలతో ఫిర్యాదు చేసామని అందోలు ఇరిగేషన్ శాఖ ఎఇ మజర్ తెలిపారు.

## స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

**-జిల్లా మైనారిటి సంక్షేమ అధికారి గోపాల్‌రావు**

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

నేషనల్ మైనారిటీస్ ప్రీ మెట్రిక్ ,బేగం హజ్రత్ మహాల్ స్కాలర్షిప్‌ల కొరకు నూతన,రిన్యూవల్ కొరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకొనుటకు ఈనెల 15నుండి 30 వరకు అవకాశం కల్పిస్తున్న జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి సిహెచ్ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అవకాశాన్ని మైనారిటీ విదా ర్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

## అభివృద్ధి పనులను పరిశీలించిన శిక్షణ ట్రైనీ కలెక్టర్లు

**మిరుదొడ్డి, నవంబరు 1, ప్రభాతవార్త :** మండలంలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం ట్రైనీ కలెక్టర్లు చందన్‌కుమార్‌ముర్ము, శివశంకర్ ఠాగూర్, గమన్,ఎరిక్ కుజూర్‌లు స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న పారిశుద్య పనులతో పాటు పల్లెప్రకృతి వనం,నర్సరీ,మిషన్ కాకతీయ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ మెట్లు, బాలవికాస వాటర్ ప్లాంట్,ఐకెపి సెంటర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన పల్లె ప్రకృతి వనం,నర్సరీ పనులు బాగున్నాయని సర్పంచ్‌ను అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్ద కవితరాజు,ఉపసర్పంచ్ అమర్ తదితరులు పాల్గొన్నారు.

## కనువిప్పు లఘుచిత్రం విడుదల

**జగదేవ్‌పూర్, నవంబర్ 1 (ప్రభాతవార్త):**

సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలు, మోసాలపై చిత్రీకరించిన కనువిప్పు లఘుచిత్రాన్ని ఎస్ఐ కృష్ణమూర్తి, స్థానిక సర్పంచ్ లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగదేవ్‌పూర్ మండల పరిధిలోని నబీనగర్ గ్రామానికి చెందిన బీరప్ప దర్శకత్వంలో నిర్మించిన కనువిప్పు లఘుచిత్రాన్ని ప్రజలు వీక్షించి మూఢనమ్మకాలతో ఏ విధంగా మోసపోతున్నారో తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్, సుభాష్, హరిప్రసాద్, ఖాజా, రాజు, చిత్రం బృందం సభ్యులు దామోదర్, రామచంద్రం, బాలరాజు, రాజు, రాజ్‌కుమార్, నర్సింలు, జమున తదితరులు పాల్గొన్నారు.



కనువిప్పు లఘుచిత్రం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ కృష్ణమూర్తి



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

## బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**అల్లాదుర్గం, నవంబర్ 1, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దపూర్‌లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా బస చేయనున్న సందర్భంగా పటిష్టబందోబస్తు ఏర్పాట్లను చేయనున్నట్లు, బస చేసే స్థలాన్ని మంగళవారం నాడు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పరిశీలించడం జరిగింది. రాహుల్ గాంధీ జోడో యాత్రలో భాగంగా సంగారెడ్డి జిల్లా నుండి ప్రారంభమై గడిపెద్దపూర్‌లో బస చేయనున్న సందర్భంగా మండలంలోని కార్యకర్తలు, జిల్లా నలుమూలలనుండి నాయకులు పాల్గొననున్న సందర్భంగా సభకు భారీ బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అల్లాదుర్గం పోలీస్ సర్కిల్ పరిధిలోని పెద్దపూర్ నుండి శని, ఆదివారాలలో జోడోయాత్ర ప్రారంభమవుతున్నందున అక్కడ తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను పరిశీలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ జిల్లానుండి వచ్చే సిబ్బందికి పాదయాత్రలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లపై జిల్లా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం సిఐ జార్జ్, ఎస్‌బి సిఐ నవీన్‌బాబు, అల్లాదుర్గం ఎస్ఐ నవీన్‌కుమార్‌రెడ్డి, పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజు, పోలీస్ సిబ్బంది, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారికి బోనాలు సమర్పణ

**చిన్నశంకరంపేట, నవంబరు 1,ప్రభాతవార్త:** లక్ష్మీనరసింహస్వామి దేవాలయ షష్టిమ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఉత్సవాల్లో చివరి రోజు దుర్గమాతకు భోనాలు, అన్నదానం నిర్వహిచినట్లు ఆలయ అభివృద్ధి కమీటీ సభ్యులు తెలిపారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గోని అమ్మవారికి భోనాలు సమర్పించారు. మల్లుపల్లి, జంగరాయి, చందాపూర్ తదితర గ్రామాల నుండి భక్తులు అదిక సంఖ్యలో హజరై మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలు తీసుకెళుతున్న గ్రామస్థులు



మాట్లాడుతున్న అడిషనల్ డిసిపి మహేందర్

## ఆరోగ్యంపై పోలీసులకు అవగాహన సదస్సు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశాలు, సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత సలహాల మేరకు పోలీస్‌శాఖలో విధులు నిర్వహించే అధికారులు,సిబ ఒదికి మంగళవారం సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల నిపుణులతో సిద్దిపేట అడిషనల్ డిసిపి అడ్మిన్ సందెపోగు మహేందర్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య సూచనలతో పాటు సలహాలు చికిత్సపై పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మహేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు,పోలీస్ కమిషనర్ శ్వేతల సహకారంతో విడతల వారిగా జిల్లాలోని హోంగార్డుల నుండి ఉన్నత స్థాయి అధికారుల వరకు చికిత్సలు చేయడంతో పాటు వారికి రెండు సంవత్సరాల పాటు ఆరోగ్య పరిరక్షణ గురించి డాక్టర్ల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.మంత్రి సహకారంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సిద్దిపేట జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పోలీస్ అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం వైద్య కళాశాల ప్రొఫేసర్ డా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో పోలీసులకు బిపి,షుగర్,హార్ట్ ఎటాక్,తదితర వ్యాదుల గురించి అవగాహన కల్పించి 325 మంది పోలీస్ అధికారులకు సిబ్బందికి ప్రాథమిక చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు.

## విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలుగా 10 వేల మంది

**-జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ**

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 1 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో మంగళవారం విశ్వహిందూ పరిషత్ జిల్లా సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం హితచింతక్ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పబ్బ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 10 వేల మందిని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలుగా చేర్చబోతున్నామని తెలిపారు. నవంబర్ 6వ తేదీ నుండి 20వ తేదీ వరకు 15 రోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి హిందూ బంధువులు పాల్గొని రూ. 20 విశ్వహిందూ పరిషత్ సభ్యత్వం స్వీకరించాలని కోరారు. హిందూ ధర్మ కార్యం చేయడంలో విశ్వహిందూ పరిషత్ ముందుంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. దేవాలయాల సంరక్షణలో జాతిని సంఘటతి చేయడంలో విశ్వహిందూ పరిషత్ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం, వాభాగ ప్రచార ప్రముఖ్ అప్పల సునీల్, జిల్లా ఉపాధ్యక్షులు మల్కారి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి ఎర్రం ముత్యాలు, జిల్లా కార్యదర్శి నీల శ్యామ్, జిల్లా ప్రచార ప్రముఖ్ ఎర్రం ప్రశాంత్, పట్టణ అధ్యక్షులు అరవింద్, రాహుల్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

**-మెదక్ జిల్లా తూనికలు, కొలతల అధికారి సుధాకర్**

**వెల్దుర్తి, నవంబర్1 ప్రభాతవార్త:** మంగళవారం వెల్దుర్తిలోని పలు కిరాణా, బట్టల దుకాణాల్లో జిల్లా తూనికలు, కొలతల అధికారి సుధాకర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో సరిగ్గా కొలతలు లేనందున ఆయన అసహనం వ్యక్తం చేస్తూ నాలుగు దుకాణాలకు పెనాల్టీ విధించారు. అనంతరం ఓ కిరాణా షాపులో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమతుల్లేని ప్యారిస్ సిగరేట్లను విక్రయిస్తున్నందున అట్టి సిగరేట్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిరాణా దుకాణాల్లో సామాన్యులకు అందుబాటులో ఉండే ధరలకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి ఉన్న వస్తువులనే విక్రయించాలని, అనుమతులు లేని వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జోడో యాత్రకు బందోబస్తు ఏర్పాట్లు

**సంగారెడ్డి టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్ర ఈ నెల2వ తారీఖున సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తుండటంతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం.రమణకుమార్ సూచించారు. బుధవారం మధ్యహ్నాం 3 గంటలకు బిహెచ్ఇఎల్ బస్టాండ్ నుంచి ఇక్రిశాట్, పటాన్‌చెరువు మీదుగా ముత్తంగి వరకు కొనసాగుతుందన్నారు. 3వ తేదీన రుద్రారం గణేష్ మందిరంనుంచి సంగారెడ్డి చౌరస్తా గుండా హనుమాన్ నగర్ మీదుగా జెఎన్‌టియు వరకు యాత్ర చేరుకుటుందన్నారు. 5వ తారీఖు రోజున ఉదయం 6గంటలకు జోడో యాత్ర చౌటకూరు, జోగిపేట మీదుగా ఎర్రారం శివారులో రాహుల్ గాంధీ యాత్ర మెదక్ జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. 6వతేదీన జోడో యాత్ర తిరిగి సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ప్రారంభమై మహదేవ్‌పల్లి శివారులో యాత్ర కొనసాగుతుందన్నారు. జోడో యాత్రలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉత్పనం కాకుండా ముందస్తుగానే ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

**-జిల్లాలో వాహనాలకు మళ్లింపులు**

**-జిల్లా ఎస్పీ రమణకుమార్**

**ట్రాఫిక్ ఆంక్షలు ఇలా...**

రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రను పురష్కరించుకుని జిల్లాలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్‌పి రమణకుమార్ వివరించారు. ఎస్పీ కథనం ప్రకారం... హైదరాబాద్ వెళ్లే వాహనాలు మధ్యాహ్నాం 3 గంటల నుంచి ముత్తంగి ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందని, సంగారెడ్డి నుంచి హైద్రాబాద్ వెళ్లే వాహనాలు కంది చౌరస్తా మీదుగా హైద్రాబాద్ వెళ్లాలని సూచించారు. 3వ తేదీన జోగిపేట వైపు నుంచి హైద్రాబాద్ వెళ్లే వాహనాలను ఉదయం 6 గంటల నుంచి గణపతి చక్కర కర్మాగారం వద్ద గల కొత్త వెంతెన నుంచి ఎంఎన్‌ఆర్, గణేష్ గడ్డ మీదుగా హైదరాబాద్ పోవాల్సి ఉంటుందన్నారు. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు మల్కాపూర్ చౌరస్తా నుంచి మల్లేపల్లి మీదుగా హైద్రాబాద్ పోవాల్సి ఉంటుందన్నారు. 5వ తేదీన నారాయణఖేడ్ వైపు నుంచి హైద్రాబాద్ వెళ్లే వాహనాలు సింగిల్ వేలో ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. జోడో యాత్రతో వాహన దారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగుండా రోడ్డు మళ్లింపు చేపట్టినట్లు వాహన చోదకులు పోలీసులకు సహకరించి తమ ప్రయాణాన్ని సురక్షితంగా, క్షేమంగా చేరుకోవాలని ఎస్‌పి యం రమణకుమార్ జిల్లా ప్రజలకు సూచించారు.



పిఎసిఎస్ చైర్మన్‌తో మాట్లాడుతున్న డిసిఓ చంద్రమోహన్‌రెడ్డి

## జగదేవ్‌పూర్ పిఎసిఎస్‌ను సందర్శించిన డిసిఓ

**జగదేవ్‌పూర్, నవంబర్ 1 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని మంగళవారం జిల్లా డిసిఓ చంద్రమోహన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా మండలంలోని రైతులకు ఏవిధంగా సేవలు అందిస్తున్నారనే విషయాన్ని పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా సహకార సంఘం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సంఘం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ రఘోత్తంరెడ్డి, జగదేవ్‌పూర్ పిఎసిఎస్ డైరెక్టర్ భూమయ్య, సిబ్బంది రాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన మండల విద్యాధికారి



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాధికారి నీలకంఠం

**టేక్మాల్, నవంబరు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేసిన మండల విద్యాధికారి నీలకంఠం తనిఖీ చేశారు. మంగళవారం టేక్మాల్ మండల పరిధిలోని తంప్లూర్, సాలోజిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక, కోన్నత, ఉన్నత పాఠశాలను తనిఖీచేశారు. పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు వారి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల సమయంలో పాఠశాలల్లోనే ఉండాలన్నారు. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. ఇందులో ఉపాధ్యాయులు రజిత, సుధాకర్, రాంరెడ్డి, ప్రవళిక, అమూల్య, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, రాములు, జోష్న,మమత, నీరజలున్నారు

## మునుగోడులో మిరుదొడ్డి నాయకుల ప్రచారం

**మిరుదొడ్డి, నవంబరు 1, ప్రభాతవార్త:** దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదేశాల మేరకు మంగళవారం మునుగోడు నియోజకర్గంలోని సంస్థాన్‌నారాయణపూర్ మండలంలోని చిమిర్యాల గ్రామంలో మిరుదొడ్డి బిజెపి మండల అధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మద్దతుగా ఇంటింట్కిఇ తిరిగి చివరి రోజు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో రాజగోపాల్‌రెడ్డి విజయం ఇదివరకే ఖాయం అయిందని,మెజారిటీ కోసమే ప్రచారం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు స్వామి,నరేష్,బాల్‌రాజుతో పాటు పాల్గొన్నారు.

## ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**



మాట్లాడుతున్న జాతీయ అవార్డు గ్రహీత అశోక్

విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నతశిఖరాలను అధిరోధించాలని జాతీయ అవార్డు గ్రహీత,సైకాలజిస్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా పరికిపండ్ల అశోక్ అన్నారు.మంగళవారం రోజున తెలంగాణ వెనుక బడిన తరగతుల శాఖ ఉద్యోగిత నైపుణ్యం అభివృద్ధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ ,పిజి కళాశాల గ్రందాలయ బ్లాక్‌లో నడుస్తున్న ఉచిత శిక్షణ తరగతుల్లో వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యదర్శి బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రాష్ట్ర బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ అశోక్‌కుమార్,స్టడీ సర్కిల్ డైరెక్టర్ కృష్ణదయాకర్ అధ్యక్షతన ప్రేరణ సదస్సులో అశోక్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఏకాగ్రత పెంపొందించుకునే సూత్రాలను వివరించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ కోఆర్డినేటర్ రాజేశ్వరి,ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి,విశ్రాతం ఎంపిడివొ విద్యాసాగర్,ఉపాధ్యాబృదం కృష్ణ,రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ధాన్యం ఆరబోయద్దు : ఎస్ఐ



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

**అక్కన్నపేట, నవంబరు 1,ప్రభాతవార్త :** మండలంలోని రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయద్దని అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్ అన్నారు. మంగళ వారం మండల పరిధిలోని కుందన్‌వానిపల్లి నుండి గౌరవెల్లి గ్రామానికి వెళ్లే దారిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని రహదారిపై ఆరబెట్టడంతో ప్రయాణించే బాటసారులు ఎస్ఐకి ప్రయాణం ఇబ్బంది కరంగా మారిందని తెలపడంతో ఎస్ఐ వివేక్ స్పందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని రోడ్డుకు ప్రత్యమ్నయంగా ఇతర ప్రదేశాలలో ఆరబెట్టుకోవాలన్నారు.రోడ్డుపై ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహణ దారులు ప్రమాదాలకు గురయ్యో అవకాశం ఉ ందని కావున రైతులు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు.కాదని రోడ్డుపైనే ధాన్యాన్ని ఆరబోస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం నూతన కార్యవర్గం

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా ద్వితీయ మహాసభలు మంగళవారం జరిగాయి. ఈ సభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.నూతన జిల్లా అధ్యక్షునిగా కొంగరి వెంకట్ మావో,ప్రధాన కార్యదర్శిగా రాళ్లబండి శశిధర్,జిల్లా ఉపాధ్యక్షులుగా తాడూరి రవిందర్,పండుగ బాలమణి,రవీంద్ర చారి,సహాయ కార్యదర్శులుగా గొరై శ్రీనివాస్,బి రమేష్,పుష్ప,జిల్లా కమిటి సభ్యులుగా గుండ్ర రవిందర్, బోయిని మల్లేశం,కొమురవెలికల కనుకయ్య, మ్యాకల కృపాకర్, సైదు వెంకటస్వామి, ఎల్లస్వామి, యాదమ్మ, నర్సయ్య, మహేష్, శ్రీశైలం, కలకవ్వ, రేణుక, ఎల్లయ్యలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నుకోబడిన నూతన కార్యవర్గంలో 22 మందిని ఎన్నుకున్నట్లు మహసభలకు ముఖ్య అతిధిగా హాజరైన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహించిన మహసభల్లో వ్యవసాయ కూలీల సమస్యలపై చర్చించా మని, భవిష్యత్తులో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు.

# మునుగోడు ఉప ఎన్నికల్లో టిఆర్‌ఎస్‌దే విజయం

### ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి

**శివ్వంపేట, నవంబర్ 1 ప్రభాతవార్త:** ఈనెల 3వతేదీన జరిగే మునుగోడు ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పి కో-ఆప్షన్ సభ్యులు మన్సూర్‌లతో కలిసి శివ్వంపేట విలేకరులతో ఆయన చరవాణిలో మాట్లాడారు. తాము చేస్తున్న ప్రచారానికి మునుగోడులోని అన్ని గ్రామాలలో మంచి అపూర్వ స్పందన లభిస్తుందని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలు అమలుపరచడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందని గుర్తుంచుకోవాలని ఆయన మునుగోడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మునుగోడు నియోజకవర్గాన్ని మంత్రి కేటీఆర్ దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, హరికృష్ణ, మహేష్‌గుప్త, మన్సూర్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు బూటకపు హామీలు ఇస్తూ ఓటర్లను ప్రలోభ పరుస్తున్నారని, అక్కడి ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని తప్పకుండా ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తారని మదన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షులు రమాకాంత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, ఆత్మకమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి ఉన్నారు.

# మున్సిపాలిటీలో పెంచిన ఇంటిపన్నులు తగ్గించాలి

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 1, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో పెంచిన ఇంటి పన్నులను వారంరోజులలోగా తగ్గించాలని, లేదంటే పట్టణ ప్రజలతో కలిసి బిజెపి పక్షాన మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని బిజెపి పట్టణ అధ్యక్షుడు జంగంపల్లి శంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఈమేరకు మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌కు బిజెపి నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న రామాయంపేటను మున్సిపాలిటీగా మార్చితే ఎంతో అభివృద్ధి అవుతుందని స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రి హరీష్‌రావులు చెప్పి 5 సంవత్సరాల కింద మున్సిపాలిటీని ఏర్పాటుచేశారని, మున్సిపల్‌కు ఎన్నికలు జరిగికూడా 4కావస్తుందని, మరి పట్టణంలో ఏం అభివృద్దిచేశారో చెప్పాలని డిమండ్ చేశారు. అభివృద్ధికి కోసం ఎమ్మెల్యే, మంత్రి ఎన్ని నిధులు కేటాయించారు, ఏం పనులు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. రామాయంపేట ప్రజల పట్ల వివక్ష చూపుతూ అభివృద్ది పనులు చేయట్లేదని అన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రజల సమస్యల గురించి, అభివృద్ది పనుల గురించి అడిగితే, మీ



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న బిజెపి నాయకులు

అంతుచూస్తాం...దాడులు చేస్తాం....రాజకీయం అంటే ఏంటో చూపిస్తాం అని మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ముఖ్యంగా రామాయంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది మున్సిపల్ చట్టం ప్రకారం పనిచేయకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పట్టణంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజల ఆర్థిక పరిస్థితులను, ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పన్నుల భారం పడకుండా ప్రభుత్వం ఇంటి పన్నులను తగ్గించాలని బిజెపి పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు సతీష్‌రావు, పట్టణ మైనారిటీ అధ్యక్షుడు జహీర్, ఓబిసీ అధ్యక్షుడు కె.కార్తిక్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైరం సిద్దరాములు, నాయకులు అవినాషరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## జోడో యాత్రను విజయవంతం చేయాలి

**టిపిసిసి రాష్ట్ర సభ్యులు సోమన్నగారి లక్ష్మిరవీందర్‌రెడ్డి**

**నర్సాపూర్, నవంబర్ 1, ప్రభాతవార్త:** ఏఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రతో కాంగ్రెస్ నేతల్లో జోష్ నింపుతుందని దీంతో కాంగ్రెస్ పార్టీకి మరింత భలోపేతం అవుతుందని టిపిసిసి రాష్ట్ర సభ్యులు సోమన్నగారి లక్ష్మి రవిందర్‌రెడ్డి అన్నారు.మంగళవారం నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన బారత్ జోడో యాత్రకు ప్రజలనుండి విశేష స్పందన లబిస్తుందని అన్నారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపయ్యిందని పేర్కొంటు తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ మరింత భలోపేతం అవుతుందన్నా ధీమాను ఆయన వ్యక్తం చేశారు.ఈ మేరకు ఈ నెల 3 న రాహుల్ గా:ధీ భారత్ జోడో యాత్ర సంగారెడ్డి జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు.ఈ భారత్ జోడో యాత్రలో బాగంగా సంగారెడ్డి సమీపంలోని పసల్వాది శివ్వంపేటవద్ద కార్నర్ మీటింగ్ ఉంటుందని అదేవిదంగా జోగిపేట అన్నాసాగర్‌వద్ద రాహుల్ గాంధీ భహిరంగ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. భారత్ జోడో యాత్రలో బాగంగా నిర్వహిస్తున్న భహిరంగ సభకు నర్సాపూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇదిలా వుండగా మునుగోడు ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్, బిజెపి పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ పట్ల అక్కడి ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. గతంలో కూడ ఈ మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ఈ ఉప ఎన్నికల్లో కూడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తాడన్నా ధీమాను రవిందర్‌రెడ్డి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర సభ్యులు సోమన్నగారి లక్ష్మి రవిందర్‌రెడ్డి తో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ అడ్మిషన్లకు 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 1, ప్రభాతవార్త:** 2022-23 సంవత్సరానికి ఐటిఐ అడ్మిషన్ల కొరకు 3వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ సంగారెడ్డి ప్రిన్సిపల్ షకే రాజేశ్వరావు మంగళవారం నాడొక ప్రకటలో తెలియజేశారు. 3వ తేది ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వకు వాకిన్ సెలక్షన్స్ జరుగుతాయని ఆసక్తి ఉన్నవారు ఒర్జినల్ పదవతరగతి సర్టిఫికేట్లు, రెండు జతల జీరాక్స్ కాపీలను వెంట తీసుకోని ప్రభుత్వ ఐటిఐ సంగారెడ్డి కి రాగలని ఆయన తెలిపారు.

## చేతిరాత పుస్తకాలు డ్రాయింగ్ బుక్స్ పంపిణీ

**మునిపల్లి, నవంబర్ 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్లిఖార్జునపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు చంద్రమౌళి కూతురు శ్రేష్ట పుట్టినరోజు సందర్భంగా విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదినాన్ని జరుపుకోని, విద్యార్థులకు చేతిరాత పుస్తకాలు డ్రాయింగ్ బుక్స్, పెన్నులు, క్రేయాన్స్ అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు రమణ, రాజేశ్వర్, సుజు ఉద్దీన్, ప్రవీణ్, చంద్రమౌళి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## గాజుల్‌పాడ్‌లో రైతులకు యాసంగి పంటలపై అవగాహన

**సంగారెడ్డి, నవంబర్ 1, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని గాజులపాడ్ గ్రామపంచాయతీ రైతువేదికలో యాసంగి పంటపై అవగాహన కార్యక్రమాన్ని మండల ఎంఎఓ ప్రవీణ్ చారి, ఎఓ హన్మండ్లు రైతులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగిలో రైతులు పంటలు నాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్ష సూచనలు తెలుసుకుని నాటువేసే విత్తనాలపై తగుజాగ్రత్తలు తీసుకోవాలని, శెనగపంటకు విత్తనం వేసేటప్పుడు అధికంగా వర్షాలు పడితే విత్తనాలు అన్ని చెడిపోతాయని, అలాగే కుసుమ, వెరుశనగ, సూర్యపువ్వులో, చిరుధన్యాల పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. అవసరమైన పద్దతిలో నాటువేయడం ద్వారా పంటల దిగుబడిని పొందొచ్చని, అందరు ఎకకాలంలో ఒకే రకమైన విత్తనాలను నాటినచో ధరలు తగ్గుతాయని కావున రైతులు వేరు వేరు పంటలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంఛార్జ్ సర్పంచ్ లక్ష్మిమల్లేష్, రైతుబంధు కో-ఆర్డినేటర్ ఎస్ సురేష్ పాటీల్, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా నిలబడతా

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**సంగారెడ్డి, నవంబర్ 1, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ కార్యకర్త జింక వినోద్ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మునుగోడు బై-పోల్ ప్రచారంలో ఉండడంతో తన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తే తన తనయుడు రాష్ట్ర యువ నాయకుడు విక్రమ్‌రెడ్డిని నల్లవల్లి గ్రామానికి పంపించి జింక వినోద్ కుటుంబానికి వారి తండ్రి జింక ఎల్లయ్యకు 60 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందించడం జరిగింది. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త కుటుంబానికి ఎల్లవేళల్లో కష్టసుఖాల్లో ఆపద సమయాల్లో అండగా నిలబడతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లవల్లి గ్రామ సర్పంచ్ దోమడుగు శంకర్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు ఫయాజ్, షరీఫ్, టీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు కానోజీ రాములు, నల్లవల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ముదిరాజ్, గ్రామ కమిటీ అధ్యక్షులు పెద్దంగాల మహేష్, ఉపసర్పంచ్ కొరివి శంకర్, నాయకులు బాలయ్య, అశోక్ గౌడ్, వెంకటేష్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మైత్రి మైదానంలో సంగీత్ విభావరి

### జనసంద్రంగా మారిన పటాన్‌చెరువు పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రముఖులు

**పటాన్‌చెరువు, నవంబరు 1, ప్రభాతవార్త:** ఛట్ పూజా కార్యక్రమాలను పురస్కరించుకుని పటాన్‌చెరువు పట్టణం జన సంద్రంగా మారింది. ఉసికె వేస్తే రాలనంత జనం పట్టణంలోని మైత్రి మైదానంలో పాల్గొన్నారు. మైత్రి మైదానంలో భోజ్‌పూరి నటులు కేసిర లాల్‌యాదవ్ నిర్వహించిన సంగీత విభావరి సభికులను ఉర్రూతలూగించింది. ఛట్ పూజాకార్యక్రమాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన విషయం పాఠకులకు విధితమే. పూజా కార్యక్రమాలకు నియోజకవర్గంలోని ఇస్నాపూర్, పాశమైలారం, రామచంద్రాపురం, బొల్లారం, పటాన్‌చెరువు, సంగారెడ్డి ప్రాంతం నుంచి ప్రజలు తరలివచ్చారు. పటాన్‌చెరువు ప్రాంతంలో నివాసం ఏర్పర్చుకుని జీవిస్తున్న ఉత్తర్ ప్రదేశ్, ఝూర్ఖండ్, మధ్య ప్రదేశ్, బీహార్, ఉత్తరాంచల్ తదితర రాష్ట్రాల ప్రజలు



సంగీత విభావరిలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను అభినందించిన నటులు...**

తెలంగాణలో మొదటిసారి పటాన్‌చెరువులో సంగీత విభావరిలో పాల్గొన్నానని భోజపూరి నటులు కేసరి లాల్ యాదవ్ పేర్కొన్నారు. విమానాశ్రయం నుంచి పటాన్‌చెరువు వరకు అడుగడుగునా స్వాగతం పలికేలా ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**జగదేవ్‌పూర్, నవంబర్ 1 (ప్రభాతవార్త):** సైబర్ మోసగాళ్ళతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కృష్ణమూర్తి అన్నారు. మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో ప్రజలకు కనువిప్పు కార్యక్రమం ద్వారా పోలీసు కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనువిప్పు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న మూఢనమ్మకాలపై కళాజాత బృందం ద్వారా అవగాహన కల్పించారు. అదేవిధంగా వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని అన్నారు. సైబర్ నేరాలు జరుగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, సైబర్ నేరగాళ్ళ వలలో పడకుండా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే తమ బ్యాంకు ఖాతా వివరాలు కానీ, ఓటిపి నెంబర్లు కానీ చెప్పకూడదన్నారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ళతో మోసపోయినట్లయితే ఎన్‌సిఆర్‌పి పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జిఓవి.ఇన్‌లో ఫిర్యాదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, ఎంపిటిసి, గ్రామ ప్రజలు, పోలీస్ కళాబృందం సభ్యులు బాల్‌నర్సు, రాజు, రవీందర్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

**కొల్చారం, నవంబర్ 1 ప్రభాతవార్త:** వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని కొల్చారం ఎస్ఐ సార శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం అప్పాజిపల్లి గ్రామంలోని బస్టాండ్‌లో లారీలు, ట్రాక్టర్ల డ్రైవర్లకు, యజమానులకు, గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అప్పాజిపల్లి గ్రామంలో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా లారీలు, ట్రాక్టర్లను నిలిపిన వారికి నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అప్పాజిపల్లి గ్రామంలో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా లారీలు, ట్రాక్టర్లు నిలపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని, మళ్లీ రోడ్డుకు ఇరువైపులా లారీలు, ట్రాక్టర్లు నిలిపితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరి కోతల సందర్భంగా రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని తెలిపారు. ట్రాక్టర్ల డ్రైవర్లు మితి మీరిన వేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా వెళ్లాలని, వాహనాలకు తప్పనిసరగా ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే ఓనర్లపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. రోడ్డు ప్రమాదాలు చిన్న చిన్న లోపాల వల్ల జరుగుతాయని, అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి చలం ఝాన్సీ యాదగిరి, ట్రాక్టర్లు, లారీల డ్రైవర్లు, యజమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలో ఉత్తీర్ణులైన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ : సిఐ

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 1, ప్రభాతవార్తః** ఇటీవల విడుదలైన పోలీసన కానిస్టేబుల్,ఎస్ఐ ప్రాథమిక రాత పరీక్షలో ఉత్తీర్ణులైన మరియు అర్హత సాధించిన అభ్యర్థులందరికీ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్ గురించి ఉచితంగా శిక్షణ ఇప్పించడం జరుగుతుందని రామాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇందుకుగాను ఎంపికైన అభ్యర్థులందరూ కూడా ఉదయం 5 గంటలకు కళాశాల మైదానంకు రావాల్సిందిగా కోరారు. ఫిజికల్ ట్రైనింగ్ తీసుకోవాలన్నారు. ఈ శిక్షణను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మరియు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శినిగార్లు ప్రత్యేక చొరవతో అభ్యర్థులందరికీ ఉచితంగా ఇప్పించడం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి : ఎస్ఐ**

ఈనెల 1వ తేదీనుండి 12వ తేదీ వరకు జాతీయ లోక్‌అదాలత్ ఉన్నదని రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు ఎవరైతే కేసుల లో సంబంధం ఉన్నవారుంటే లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. రాజీ మార్గమే..రాజ మార్గమని, రాజీపడితే ఇద్దరూ గెలుస్తారని ఈసందర్భంగా ఆయన సూచించారు. లోక్‌అదాలత్‌లో రాజీపడాలనుకున్న వారు స్థానిక ఎస్ఐ 9490617051, వినయ్ 7901147200, రవి 955066325 నంబర్లను సంప్రదించాలన్నారు.

## స్వయం సహకార సంఘాలకు రూ. 9 కోట్ల రుణం

**అక్కన్నపేట, నవంబరు 1,ప్రభాతవార్త :** మండలంలోని గండిపల్లి, రామవరం, కుందన్‌వానిపల్లి, గుడాటిపల్లి గ్రామాలకు సంబందించిన స్వయం సహాయ బృందం సంఘాలకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ హుస్నాబాద్ బ్రాంచ్ తరుపున రూ 9కోట్ల రుణం మంజూరు చేసినట్లు మంగళవారం బ్యాంకు మేనేజరు బాబా వాహబ్,ఏపిఎం శ్రీనివాస్,సిసి గొర్ల తిరుపతియాదవ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

## చరణ్ సాయిదాస్‌కు సన్మానం

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

యాదాద్రిలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం మంగళవారం రోజున నిర్వహించగా ఈ కార్యక్రమంలో సిద్దిపేటకు చెందిన వేమన చరణ్ సాయి దాస్, కల్లెం లక్ష్మన్‌లు పాల్గొని కవితా గానం చేయగా కళావేదిక చైర్మెన్ కత్తిమండ ప్రతాప్,జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి నేతాజీ ప్రధాన కార్యదర్శి లలితలు వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

## విద్యపై డివిజన్ శాఖ సమావేశం

**హుస్నాబాద్, నంబరు 1, ప్రభాతవార్త :** హుస్నాబాద్ డివిజన్ స్థాయిలో విద్య అంశంపై డివిజన్‌స్థాయి సమావేశం మంగళవారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ మండల విద్యాశాఖాధికారి వెల్లడించారు.ఈ సమావేశానికి డివిజన్‌స్థాయిలోని మండలశాఖ విద్యాశాఖాదికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక స్థాయి ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలతో పాటు మన ఊరు మన బడి,మధ్యాహ్న భోజన వివరాలతో పాటు పలు అంశాలపై చర్చించారు.

## ఆదర్శ కమ్యూనిస్టు మల్లన్నయాదవ్

**-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్**

**హుస్నాబాద్, నవంబరు 1,ప్రభాతవార్త :** ఆదర్శ కమ్యూనిస్టు మేకల మల్లన్నయాదవ్ అని సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు గడిపె మల్లేష్ అన్నారు. మంగళవారం రోజున సిపిఐ సీనియర్ నాయకులు మేకల మల్లన్న యాదవ్ 9వ వర్థంతి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లన్నయాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లన్న తోపుదు బండ్లు నడుపుతూ సిపిఐ నాయకత్వంలో తోపుడు బండ్ల సంఘం నిర్మాణం కోసం అప్పటి రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ,అయిలేని మోహన్‌రెడ్డిల సహకారంతో సంఘం బలోపేతానికి కృషి చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు సంజీవరెడ్డి,సుదర్శనచారి,సరోజనతో పాటు మల్లన్న కుటుంబ సభ్యులు పద్మ, చంద్రశేఖర్, పద్మ, నిర్మల, శోభ, సుజితకుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న గడిపె మల్లేష్

## చోరీ కేసులో వ్యక్తికి ఏడాది జైలుశిక్ష

**అక్కన్నపేట, నవంబరు 1, ప్రభాతవార్త :** మండలంలోని మల్లంపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి అందులో ఉన్న 15కిలోల అల్యూమినియం దొంగిలించాడని ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ఇంజనీర్ 2016 సంవత్సరంలో అప్పటి ఎస్ఐ సంజయ్‌కి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పరిశోదన చేసిన ఎస్ఐ సంజయ్ దొంగను పట్టుకుని అరెస్టు చేసి జుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. అనంతరం పరిశోదన పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ నమోదు చేశారు. అప్పటి నుండి సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టులో విచారణ జరిగి నేరం రుజువైనందున మంగళవారం రోజున నేరస్తుడైన అల్లా రాజుకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్షతో పాటు రూ 1వెయ్యి జరిమాన విదించినట్లు హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్,అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కేసును చేదించిన అధికారులను సిద్దిపేట అడిషనల్ డిసిపి అడ్మిన్ మహేందర్ అభినందించినట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న టిపిసిసి సభ్యులు నరోత్తం

## భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలి

**-టిపిసిసి సభ్యుడు వై నరోత్తం**

**జహీరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నిర్వహిస్తున్న భాతర్ జోడో యాత్రను విజయవంతం చేయాల్సిన అవసరం అందరిపై ఉందని టిపిసిసి సభ్యులు వై నరోత్తం గుర్తు చేశారు. మంగళవారం నరోత్తం మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, అందోల్, అల్లాదుర్గ్, శంకరంపేట గ్రామాలగుండా యాత్ర కొనసాగుతుందని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని వినతి చేశారు. ఈ నెల 5న జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అల్లాదుర్గ్‌లో నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలాలని సూచించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు మేనోద్దీన్, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు యండి యూసూఫ్, మహ్మద్, షరీఫ్, కె రాజు, పెంటన్న, పాండు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మన్‌సాన్‌పల్లిలో వరి పంటపై ప్రదర్శనా క్షేత్రం



వరిపంటను పరిశీలిస్తున్న దృశ్యం

**జోగిపేట, నవంబర్ 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లిలో రైతు రవీందర్‌రెడ్డి పొలంలో పండిస్తున్న కొత్త రకం వరి వంగడం డబ్లుజిఎల్ 915 వరిపంటపై మంగళవారంనాడు ఏడిఏ అరుణ ఆధ్వర్యంలో పలు గ్రామాల రైతులకు ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ఈ పంటలో పాము పొడు తెగుళ్లు, అగ్గి తెగుల్లు, మనిపండు తెగుళ్ల దోమపోటును తట్టుకుంటుందని తెలిపారు. పిలకల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ వెన్నులో గింజల సంఖ్య ఎక్కువగా ఉండటంతో దిగుబడి అధికంగా ఉంటుందని తెలిపారు. వరంగల్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్‌చంద్ర ఈ వరిపంటపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోసానిపేట, సాయిబాన్‌పేట, మన్‌సాన్‌పల్లి రైతులతోపాటు ఏఇవో అనితలు పాల్గొన్నారు.

## గీతమ్‌లో ఉత్సాహంగా హాలో వీన్ దే

**పటాన్‌చెరువు, నవంబరు 1, ప్రభాతవార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వసతి గృహ విద్యార్థులు మంగళవారం హాలో వీన్‌డే కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. పాశ్చాత్య దేశాలలో ఆల్ సెయింట్స్ డే ను అక్టోబరు 31న జరుపుకుంటారని స్టూడెంట్ లైఫ్ సీనియర్ మేనేజర్ సమీర్ కాన్ పేర్కొన్నారు. హాలో వీన్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులు విభిన్న వేషధారణలతో, ముఖాలకు రంగులు, ఆటలు, పాటలు, సంగీతంలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ఆనందోత్సవాలతో ఉత్సాహంగా నిర్వహించారు. స్టూడెంట్ లైఫ్ సీనియర్ మేనేజర్ సమీర్ ఖాన్ స్వాగత వచనాలతో ఆరంరభమైన హాలో వీన్ డే కార్యక్రమంలో తేనేటి విందుతో కార్యక్రమాన్ని ముగించారు.

## చౌటుప్పల్‌లో బైక్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే



చౌటుప్పల్‌లో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, నవంబరు 1, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా మునుగోడు శాసన సభ ఉప ఎన్నికను పురస్కరించుకుని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం చౌటుప్పల్‌లో బైక్ ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 1, 13వ వార్డులలో బైక్ ర్యాలీ కొనసాగింది. టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి, టిఆర్ఎస్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ బైక్‌ర్యాలీ కొనసాగింది. టిఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతోనే మునుగోడు అభివృద్ధి చెందుతుంని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన నిర్మాణం చేపట్టాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ సభ్యులు

**కంగ్టి, నవంబర్ 1, ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కెవిపిఎస్ మండల అధ్యక్షులు రాహుల్, సభ్యులతో కలిసి మంగళవారం పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకులంగా స్పందించి కంగ్టి మండలంలో త్వరలోనే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం చేపడతామని ఎంపీపీ సంగీత వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని అన్ని వర్గాల హక్కుల కోసం భారత రాజ్యాంగం రాసిన మహనీయుడని యువత వారి అడుగుజాడల్లో నడవాలని అందరికీ ఉపయోగపడే విధంగా కంగ్టిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణాన్ని స్థానిక ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సహకారంతో త్వరలోనే పనులు చేపడుతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రాహుల్ ఉపాధ్యక్షులు కే అరుణ్ ప్రధాన కార్యదర్శి హెచ్ దాస్ కమిటీ సభ్యులు ఎస్ విఠల్ వి దయనంద్ శివరాజ్ పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 1 ప్రభాతవార్త:**

డిసెంబర్ 13 నుండి 16వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే ఎస్ఎఫ్ఐ జాతీయ 17వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు కోటగిరి ప్రవీణ్ అన్నారు. మంగళవారం మెదక్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యాపారీకరణ, కార్పోరేటీకరణ, విద్యారంగంలో కాషాయికరణకు వ్యతిరేకంగా ఉద్యమించనున్నట్లు తెలిపారు. నూతన విద్యా విధానం పేరుతో ఆర్ఎస్ఎస్ భావాజాలన్ని విద్యలో ప్రవేశపెట్టి సిలబస్ మార్చివేసి చరిత్రను వక్రీకరిస్తుందని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి వెయ్యికిపైగా ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియాలో మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా

**న్యాల్‌కల్, నవంబరు 1, ప్రభాతవార్త:**

గ్రామం నుంచి మండల కేంద్రానికి చేరుకునేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్యను అందుకునేందుకు నిత్యం వెళ్లేందుకు నరక యాతన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తూ మండలంలోని వడ్డి గ్రామ విద్యార్థులు, గ్రామస్థులు ఆందోళన దిగిన సంఘటన న్యాల్‌కల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని వడ్డి గ్రామం నుంచి విద్యార్థులు మండల కేంద్రమైన న్యాల్‌కల్‌కు విద్యను అందుకునేందుకు వస్తూ ఉంటారు. వడ్డి గ్రామం నుంచి డప్పూర్ గ్రామం వరకు రోడ్డుపై నడిచేందుకు సైతం అవస్థలు పడాల్సి వస్తోందని విద్యార్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వడ్డి గ్రామం నుంచి డప్పూర్ గ్రామం వరకు రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడం, సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేకపోవడంతోనే పనులు ప్రారంభం కావడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోడ్డుపై విద్యార్థులు రాస్తా రోకో నిర్వహించడంతో ముంగి న్యాల్‌కల్ రోడ్డుపై వాహనాలు ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ వినయ్ కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులకు నచ్చచెప్పి రాస్తారోకోను విరమించేలా చేశారు.



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు



ఉపాద్యాయుడితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మెన్ జితేందర్‌గౌడ్

### విద్యార్థినీల పట్ల ప్రధానోపాధ్యాయుడి ప్రవర్తనపై...

## మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం...డీఈవోకు ఫిర్యాదు

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 1, ప్రభాతవార్తః**

రామాయంపేట మున్సిపాలిటీ రెండవ వార్డు పరిధిలోని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ప్రవర్తన పట్ల మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు ఆయన పాఠశాలకు చేరుకొని విద్యార్థినీల పట్ల దురుసుప్రవర్తనపై గ్రామస్థులతో కలిసి ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డితో మాట్లాడారు. విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఇలా వెకిలిచేష్టలు చేయడం సరికాదని సూచించారు. ఆయన తీరును అక్కడినుండే జిల్లా విద్యాధికారి రమేష్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చి, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఉపాధ్యాయుడు మాకొద్దని, డిప్యూటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపించాలని కోరారు. కాగా డీఈవో రమేష్ సానుకూలంగా స్పందించినట్లు జితేందర్‌గౌడ్ తెలిపారు. అంతే కాకుండా కోమటిపల్లి గ్రామస్థులు ఆవేశానికి పోకుండా వారితో మాట్లాడి శాంతింపచేశారు. ఆయనవెంట కౌన్సిలర్ సుందర్‌సింగ్, విద్యార్థినీల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఉన్నారు.

## భారత్‌జోడో యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 1, ప్రభాతవార్త :**



భారత్‌జోడో యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర మెదక్ జిల్లాలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జోడోయాత్ర పోస్టర్‌లను రామాయంపేటలో మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల యాదగిరి ఆద్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో దేశప్రజల అవసరాలు, వారి కష్టాలు తెలుసుకుంటూ సాగుతున్న భారత్‌జోడో యాత్ర మెదక్ జిల్లాలోకి వస్తుందన్నారు. ఈ యాత్రలో కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొర్ర అనిల్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మదుగౌడ్, పట్టణ అధ్యక్షుడు మద్దూరి భానుచందర్, బిసిసెల్ పట్టణ ఉపాధ్యక్షుడు రొయ్యల హరిప్రసాద్, బొట్ల బాబు, మర్కు సతీష్ సగర, శ్రీకాంత్, కుంట రాకేష్, జీడిపల్లి సత్యనారాయణ, మోత్కు రాజు పాల్గొన్నారు.

### విద్యార్థినిలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న

### ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి : ఏబివిపి నగర కార్యదర్శి వేణు

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 1, ప్రభాతవార్త :**

రామాయంపేటమున్సిపాలిటీ రెండవ వార్డు పరిధిలోని కోమటిపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థినీల పట్ల అసభ్యంగా మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి వేణు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని ఆడపిల్లలతో ద్వందర్థాలతో కూడిన మాటలు మాట్లాడుతూ, అటెండర్ చేయాల్సిన పనులను విద్యార్థులతో చేయిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా బుద్దులు బోదించే గురువుస్థానంలో ఉండి విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం సమాజానికి సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఉపాధ్యాయుల వల్ల ఉపాధ్యాయ వృత్తికే మచ్చలా మారుతుందన్నారు. ఇట్టి సంఘటనను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న ప్రధానోపాధ్యాయున్ని వెంటనే సస్పెండన చేయాలని ఏబీవీపీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎంఈవో, డీఈవోలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి ప్రశాంత్, సంపత్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఏబివిపి నాయకులు



మునుగోడులో బిజెపి అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్న నేతలు

## మునుగోడులో బిజెపి అభ్యర్థి గెలుపు ఖాయం

**ఓబిసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షులు చిన్నరమేశ్‌గౌడ్**

**నర్సాపూర్, నవంబర్ 1, ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రాజ్‌గోపాల్‌రెడ్డి గెలుపు ఖాయమని బిజెపి ఓబిసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు ఈ సందర్భంగా చిన్న రమేశ్‌గౌడ్ అధ్వర్యంలో బిజెపి పార్టీ కోసం చివరి రోజున జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఈమేరకు నర్సాపూర్ బిజెపి నాయకుల తో కలిసి మునుగోడు నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అక్కడి ప్రజలకు బిజెపి పార్టీ చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై వారిలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బిజెపి ఓబిసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజలకు అన్నిరకాల సంక్షేమ పథకాలు అంద చేస్తుందన్నారు. ప్రజలు బిజెపికి చెందిన అభ్యర్థి రాజ్‌గోపాల్‌రెడ్డి గెలిపించాలని కోరారు. అధికార టిఆర్ఎస్ పార్టీ ఎన్నిజిమ్మిక్కులు చేసినా ఎన్ని దాడులు చేసిన మునుగోడులో బిజెపి గెలుపొందడం ఖాయమన్నా ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్ తో పాటు బిజెపి పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నాయకులు గుండం శంకర్, రింగుల ప్రసాద్ పాల్గొన్నారు.

## పాదయాత్రతో శబరిమలైకు బయిలుదేరిన అయ్యప్పస్వాములు

**నర్సాపూర్, నవంబర్ 1 .ప్రభాతవార్త:** పట్టణంలోని శివాలయం నుండి మంగళవారం 15 మంది అయ్యప్ప గురు స్వాములు శబరిమలైకు పాద యాత్రతో బయిలు దేరి వేళ్ళారు. శబరిమైలకు పాదయాత్రతో బయిలు దేరిన అయ్యప్ప గురుస్వాములు రాములు గురుస్వామి, నర్సింలు గురుస్వామి, శ్రీనివాస్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో 15మంది అయ్యప్పగురు స్వాములు బయిలు దేరారు. కాగా ఈ శివాలయంలో వారు పూజలు చేసిన అనంతరం కాలినడకన శబరిమలైలకు బయిలేదేరి వెళ్లడం జరిగింది. అయ్యప్పస్వాములు బయిలుదేరిన సమయంలో శివాలయం పూజారి గురూజి వీరప్పగురుస్వామి, అశోక్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రాకేశ్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, రుస్తుంపేట సర్పంచ్ విజయబాస్కర్‌రాజు తదితరులు భక్తి శ్రద్ధలతో వారిని సగనంపడం జరిగింది. ఈ పాదయాత్ర 41 రోజులు పాటు సాగి అప్పుడు శబరిమలైకు చేరుకుంటారని వారు తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలే : ఎస్ఐ

**కొల్చారం, నవంబర్1 ప్రభాతవార్త:** మద్యం తాగి వాహనాలు నడిపితే చలానాతో పాటు జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఎస్ఐ సార శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం మెదక్ రూరల్ సీఐ విజయ్ ఆధ్వర్యంలో మద్యం సేవించి పట్టుబడిన వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, దానివల్ల తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున మద్యం సేవించి వాహనాలు నడిపితే చలానాతోపాటు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని, మద్యలో ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం 25 మంది కోర్టుకు పంపినట్లు తెలిపారు.

## రామాయంపేటలో ఘనంగా గోపాష్టమి ఉత్సవం

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 1, ప్రభాతవార్త**

"గావో విశ్వస్య మాతః" గోవు ఈ విశ్వానికే తల్లి వంటిదని, గో ఆధారిత వ్యవసాయం చేయాలని విశ్వహిందూ పరిషత్ విభాగ్ సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం అన్నారు. మంగళవారం గోపాష్టమి ఉత్సవాన్ని గోశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోసంతతి రైతుల వద్ద ఉండాలని, రసాయనిక ఎరువుల ద్వారా వ్యవసాయాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేయాలని కోరారు. గోవులు గోశాలలో కాకుండా రైతుల వద్ద ఉండాలని తెలిపారు. రైతుల యొక్క ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాలంటే గో ఆధారిత వ్యవసాయం శ్రేష్ఠమైనదని పేర్కొన్నారు. పౌష్టిక ఆహారపదార్థాలను అందిస్తాయని అన్నారు. ఆవుల ద్వార అనేకమైనటువంటి లాభాలు ఉన్నాయని, అందుకే గోవు తల్లితో సమానమైనటువంటిదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎర్రం ముత్యాలు, పూజ్య స్వామిజీ వేదాకారాచార్యులు, ఏలూరి రవీందర్, బీర నర్సింలు, నక్క నరేందర్, ఎర్రోళ్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



గోవుకు పూజలు చేస్తున్న దృశ్యం

# లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రిదేవి**

**సంగారెడ్డి టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:** జిల్లాలో స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గాయత్రీదేవి హెచ్చరించారు. జిల్లాకేంద్రమైన సంగారెడ్డిలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ గాయత్రిదేవి అధ్యక్షతన లింగ నిర్ధారణ చట్టంపైన అడ్వైజరీ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 119 స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ అనుమతితో కొనసాగుతున్నాయన్నారు. కొత్తగా 6 కేంద్రాల నిర్వహణకు అనుమతుల కోసం ధరఖాస్తులు అంద చేశారన్నారు. 4 కేంద్రాల వారు రెన్యూవల్‌కు ధరఖాస్తులు చేసుకున్నట్లు వివరించారు. జిల్లాలో కొనసాగుతున్న కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఉండాలని సూచించారు. లింగ నిర్ధారణకు దూరంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రధాన కూడళ్ల వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో పిసిపిఎన్, డిటి బుక్ లెట్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుధా రాణి, రజని కోమల్, రాజు గౌడ్, సాగర్, కే చందర్, ఎ.ప్రవీణ్‌కుమార్, వి.రవి పాల్గొన్నారు.





పిసిపిఎన్ డిటి బుక్‌లెట్స్‌లను ఆవిష్కరిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ గాయత్రిదేవి

## శివనామస్మరణతో మార్మోగుతున్న హద్నూర్

**న్యాల్‌కల్, నవంబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ గ్రామం కార్తీక మాసాన్న పురస్కరించుకుని శివనామస్మరణతో మార్మోగుతోంది. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో కొలువున్న శివలింగానికి గ్రామానికి చెందిన భక్తులచే ఆలయ అర్చకులు శివమూర్తిస్వామి, సిద్దయ్యస్వామిలు మంత్రాలు వల్లిస్తూ రుద్రరాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహస్తున్న విషయం పాఠకులకు విధితమే. ఇందులో భాగంగా కార్తీక మాసంలో 7వ రోజైన మంగళవారం గ్రామానికి చెందిన గున్నాల విఠల్, సామల రమేష్ కుటుంబ సభ్యులు రుద్రరాభిషేకం పూజల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు స్వాములు ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్తీక మాసంలో అన్ని రోజులు రుద్రాభిషేక పూజలు నిర్వహించేలా ఏర్పాటు చేసిన ఆలయ కమిటి బాధ్యులకు గ్రామస్థులు అభినందిస్తున్నారు.

## పిహెచ్‌సిలో ఇసిడిపై శిక్షణ

**న్యాల్‌కల్, నవంబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని ప్రాథమిక ఆరోర్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్యం, పోషణ, ప్రారంభ బాల్య దశ (ఇసిడి)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆస్పత్రి పిహెచ్ఎన్ శామల సూచించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే సమాజం సుభిక్షంగా ఉండే అవకాశాలు ఉంటాయన్నారు. చిన్నారుల బాల్య దశలో పాటించాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎంపిహెచ్ఇఓ మల్కాపురం మల్లికార్జున్, చండీ దేవి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

**సంగారెడ్డి, నవంబర్ 1, ప్రభాతవార్త:** గుమ్మడిదల గ్రామంలోని కమ్మరి యాదయ్య కొన్ని రోజుల నుండి పక్షవాతంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తన సభ్యుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న తెరాస జిల్లా యువ నాయకులు, గుమ్మడిదల మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి, తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆకుల ఆంజనేయులు, అతినారం రాము, నాయకులు దామోదర్ చారి, సత్యనారాయణ, రవికుమర్, దత్తాత్రేయ, చంద్రారెడ్డి, సంగం మల్లేషా, కూరగాయల నర్సింలు, బండాల రాజు, మల్లేష్ చారి, ఆంజనేయులు చారి, కోటేశ్వర్ చారి, లక్ష్మణ్ చారి, కొత్త కృష్ణ, మేకల యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, చందు చారి తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మకు కుంకుమార్చనలు



రేణుక ఎల్లమ్మకు కుంకుమార్చనలు నిర్వహిస్తున్న మహిళలు

**వెల్దుర్తి, నవంబర్ 1 ప్రభాతవార్త:** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రేణుక ఎల్లమ్మకు ఘనంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి మంగళవారం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ గౌడ సంఘం సభ్యులు తెలిపారు. కార్తీక మాసంలో ప్రతి మంగళవారం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పరిసర ప్రాంత భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

**కొల్చారం, నవంబర్ 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట్ గ్రామంలో మంగళవారం నాడు కుట్టుమిషన్, మగ్గంవర్క్ శిక్షణ తీసుకున్న మహిళలకు టిఎస్‌డిపి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పాశం మానసశ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ పాశం మానసశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్క మహిళ కుట్టుమిషన్, మగ్గంవర్క్‌లలో శిక్షణ తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణలో మహిళలు స్వయం ఉపాధి చేసుకొనగలుగుతారని, తమకాళ్లపై తాము నిలబడేందుకు టెక్నికల్ కోర్సులు ఎంతో దోహదం చేస్తాయని ఆమె తెలిపారు. కావున ప్రతి ఒక్కర మహిళాలు ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని, మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలు తదితరులు ఉన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత

**నిజాంపేట, నవంబర్ 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. మంగళవారం నాడు మండల పరిధిలోని బచ్చురాజ్‌పల్లి, కల్వకుంట, రజాక్‌పల్లి, నార్లాపూర్, కె.వెంకటాపూర్, తిప్పన్నగుళ్ల, చౌకత్‌పల్లి గ్రామాలకు సంబంధించిన 40 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ దేశెట్టి సిద్ద రాములు, ఇంచార్జ్ తహశీల్దార్ గంగప్రసాద్‌లు లబ్దిదారులకు ఇంటింటికి వెళ్లి అందించారు. అనంతరం లబ్దిదారులతో మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ దేశెట్టి సిద్ద రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు అనూష లక్ష్మీనర్సింలు, ఎంపిటీసీ లహరి కిష్టారెడ్డి, సొసైటీ చైర్మెన్ బాపురెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ వై.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**రామచంద్రాపురం, నవంబర్ 1, ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్సు కిందపడి గుర్తు తెలియిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపల్లి చౌరస్తా వద్ద ఓ వ్యక్తి ఒక్కసారిగా పటాన్‌చెరు వైపు నుండి మోహదీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రల కింద పడుకున్నాడు. దీంతో ఆ వ్యక్తి చాతి, మెడపై నుండి బస్సు వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మరణించాడు. ఈ దృష్యాలు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. కావాలనే గుర్తు తెలియని వ్యక్తి సూసైడ్ చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాల కోసం ఆరా తీసున్నట్లు పేర్కొన్నారు. డెడ్ బాడీని పోస్టుమార్టం నిమ్మితం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కందిలో అక్రమంగా నీటి వ్యాపారం

**-పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**

**కంది, నవంబరు 1, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో అక్రమంగా నీటి వ్యాపారం కొనసాగుతున్నా అడిగే నాథులు కరువయ్యారు. నీటి సరఫరాకు రెవెన్యూ అధికారుల నుంచి కానీ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా యధేశ్చగా నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంక్‌ల ద్వార నీటిని అక్రమంగా సరఫరా చేస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల చేతులు తడిసినందుకే గమ్మున కూర్చుంటున్నారా అన్న అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరాకు అనుమతులు పొందితే గ్రామ పంచాయతీకి నిధులు సమకూరే అవకాశాలు ఉంటాయని చెప్పవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామ పంచాయితీ బాధ్యులు అక్రమ నీటి సరఫరాను అడ్డుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





అక్రమంగా నీటిని తరలిస్తున్న ట్యాంకర్